నేడు ప్రభుత్వ పాఠశాల నూతన భవనం ప్రారంభం

పంజాగుట్ట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎర్రమంజిల్‌లో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల భవనాన్ని సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నట్టు ఖైరతాబాద్ డిప్యూటీ డీఈఓ శామ్యూల్ రాజ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ఈ పాఠశాలలో 400 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. పాఠశాల భవన ప్రారంభోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఎమ్మెల్యే దానం నాగేందర్, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ విజయారెడ్డి, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఎంఈఐఎల్ ప్రాజెక్టు విభాగం అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ హరిచందన, డీఈఓ రోహిణి తదితరులు పాల్గొంటారని ఆయన చెప్పారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ శేషుకుమారి

నేడు అమీర్‌పేటలో రక్తదాన శిబిరం

అమీర్‌పేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావులు తెలిపారు. ఆదివారం సుందర్ నగర్ కాలనీలోని శేషుకుమారి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తలసాని పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అమీర్‌పేట సత్యం టాకీస్ వద్ద నిర్వహించే రక్తదాన శిబిరంలో యువత, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. అదే విధంగా కేకు కటింగ్, పేదలకు పండ్లు, పాలు పంపిణీతో పాటు గురుద్వారాలో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నట్టు తెలిపారు. నేటి ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమాలకు అందరూ తరలిరావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అశోక్‌యాదవ్, సంతోష్, మణికుమార్, శ్రీనివాస్, నర్సింహ, సుమిత్‌సింగ్, లక్ష్మి, శ్రీలక్ష్మి, లలిత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


అమృత మంజరి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి తదితరులు

అమృత మంజరి పుస్తకావిష్కరణ

ఖైరతాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో ఆదివారం అమృత మంజరి పుస్తకాన్ని కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత శ్రీమన్నారాయణ శ్రీలహరికృష్ణను వారు అభినందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీరాంతివారి, ప్రొఫెసర్ చంద్రకాంత్‌రావు, వంగా రవీందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, సురేష్ పాల్గొన్నారు.

● 'కాకా'కు నివాళి



కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి(కాకా) జయంతి సందర్భంగా ఆదివారం ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహం వద్ద మంత్రి వివేక్ వెంకటస్వామి, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్యలతో కలసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి.
- ఖైరతాబాద్, (ఆంధ్రజ్యోతి)

లిఫ్ట్ ఆపరేటర్‌గా దివ్యాంగుడు మల్లేష్

నిమ్స్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రిలో లిఫ్ట్ ఆపరేటర్‌గా దివ్యాంగుడు మల్లేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం నిమ్స్ డైరెక్టర్ బీరప్ప ఆయనకు నియామక పత్రం అందజేశారు. శంషాబాద్ పరిధిలోని మల్కారంకు చెందిన మల్లేశ్ ఇంటర్ వరకు చదివాడు. మరగుజ్జు కావడంతో అతనికి ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. కుటుంబ పోషణ ఇబ్బంది కావడంతో రెండు నెలల క్రితం భార్య లావణ్యతో కలిసి మల్లేశ్ నిమ్స్ డైరెక్టర్‌ను కలిసి ఉపాధి కల్పించాలని కోరాడు. స్పందించిన నిమ్స్ డైరెక్టర్ మానవతా దృక్పథంతో మల్లేశ్‌కు ఆస్పత్రిలో లిఫ్ట్ ఆపరేటర్‌గా ఉద్యోగం ఇచ్చి ఆదుకున్నారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్‌కు మల్లేశ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి జోక్యంతో సద్దుమణిగిన వివాదం

బోరబండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఆర్ హిల్స్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుల మధ్య తలెత్తిన వివాదం మంత్రి వివేక్ వెంకటస్వామి జోక్యంతో సద్దుమణిగింది. తమ ఇంట్లోకి చొరబడి మహిళలపై దాడి చేశారంటూ ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు యడవల్లి వెంకటస్వామి, బ్రహ్మశంకర్‌నగర్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఓర్స్ అడివయ్య మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి ఇరు వర్గాలను పిలిపించుకుని మాట్లాడారు. ఒకే పార్టీకి చెందిన నాయకుల మధ్య విభేదాలు తగవని వారికి మంత్రి హితవు చెప్పారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో కాంగ్రెస్ నాయకులు పరస్పరం దూషించుకోవడం, విభేదాలు సృష్టించడం వల్ల పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని హెచ్చరించారు. ఏమైనా సమస్యలు ఉంటే డివిజన్ పరిధిలోనే పరిష్కరించుకోవాలని సూచించారు.

సీసీ రోడ్డు నిర్మించండి

యూసుఫ్‌గూడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కల్పతరువు విజేత సూపర్ మార్కెట్ నుంచి వాసవి బృందావనం వరకు సీసీ రోడ్డు నిర్మించాలని కల్పతరువు రెసిడెన్సీ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బిన్ హమ్‌దాన్, రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు హనుమంతునాయుడు, సాయిప్రసాద్, గంగాధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రవిగౌడ్, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో రాజకీయ ఫ్లెక్సీలు

● బీజేపీ నాయకుల అభ్యంతరంతో తొలగింపు


ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బోరబండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బోరబండ బస్టాపు వద్దనున్న వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో రాజకీయ నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని తొలగించాలంటూ ఆదివారం ఆలయం వద్ద వారు నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న బోరబండ పోలీసులు బస్టాపు వద్దకు చేరుకుని బీజేపీ నాయకులతో చర్చించారు. ఆలయ ప్రాంగణంలో రాజకీయాలు చేయవద్దని పోలీసులు వారికి సూచించారు. దేవాదాయ శాఖ అధికారుల సూచనతో ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించారు.

మైనారిటీలకు కాంగ్రెస్ అండ

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్


ముస్లిం శ్మశానవాటిక జేఏసీ ప్రతినిధులకు ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న మంత్రులు లక్ష్మణ్, పొన్నం, వివేక్‌వెంకటస్వామి

యూసుఫ్‌గూడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనారిటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హామీనిచ్చారు. షేక్‌పేటలోని 2,500 గజాల స్థలాన్ని ముస్లిం శ్మశానవాటికకు కేటాయిస్తూ ప్రొసీడింగ్ కాపీని ముస్లిం శ్మశానవాటిక జేఏసీ ప్రతినిధులకు మంత్రులు పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్‌వెంకటస్వామిలతో కలిసి మంత్రి లక్ష్మణ్ అందజేశారు. అనంతరం రహమత్‌నగర్‌లో హెచ్ఎఫ్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి లక్ష్మణ్ మాట్లాడారు. వివాదంలో ఉన్న వక్ఫ్‌బోర్డు స్థలాల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. సమావేశంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా, కాంగ్రెస్ నాయకులు అజారుద్దీన్, షబ్బీర్‌అలీ, అమిత్‌రెడ్డి రవిశంకర్‌రెడ్డి, నవీన్ కుమార్, సీఎన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి: ఎంపీ అనిల్


లబ్ధిదారులకు కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

బోరబండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పేదలకు సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఏకేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో బోరబండ డివిజన్ సైట్-4, 5 కాలనీ పీజేఆర్ గ్రౌండ్‌లో లబ్ధిదారులకు కళ్లద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ నియోజకవర్గ వ్యాప్తంగా 'కనుల పండుగ' పేరిట ఏకేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదాపు రెండు వేల మందికి కళ్లద్దాలను పంపిణీ చేశామని చెప్పారు. ఏకేవై ఫౌండేషన్ సేవలు నిర్విరామంగా కొనసాగాలని ఆకాంక్షించారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు కూడా ఉచితంగా అందజేస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ కంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బోరబండ డివిజన్ అధ్యక్షుడు అశోక్, శివకుమార్‌గుప్తా, ఎండీ. రజీ, రామయ్య, నాగరాజు, సంఘసేవకుడు డా. కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధ్యం కాదు

● జీజీహెచ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విక్రమాదిత్య


మాట్లాడుతున్న జీజీహెచ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విక్రమాదిత్య

పంజాగుట్ట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధ్యం కాదని ప్రభుత్వ గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విక్రమాదిత్య అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖలో ఏకీకృతం అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డీ కి విరుద్ధమన్నారు. రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణను 2017లో హైకోర్టు కొట్టివేస్తూ స్పష్టమైన తీర్పును ఇచ్చిందని గుర్తు చేశారు. డిప్యూటీ ఈఓ, ఎంఈఓ, డైట్ లెక్చరర్, జూనియర్ కాలేజీ లెక్చరర్, తదితర పోస్టులను పదోన్నతి ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు రావాల్సిన పదోన్నతులను 30 సంవత్సరాలుగా ఇవ్వకుండా, రాకుండా పంచాయతీ రాజ్ ఉపాధ్యాయ సంఘాలు అనేక రకాల జీవోలు తెప్పిస్తూ విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకే పదోన్నతులు కల్పించాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సైదానాయక్, కోశాధికారి సైదులు, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం(జీటీఏ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిషోర్ కుమార్, సైదులురెడ్డి, ఆయా సంఘాల నాయకులు ప్రభాకర్, హరిశంకర్, ధర్మానాయక్, ఊర్మిళ, అరుణ, రమేష్, కృష్ణారావు, సంపత్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

'బీసీలకు అన్ని పార్టీలు అన్యాయం'

పంజాగుట్ట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు అన్యాయం జరుగుతోందని, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీసీలకు అన్యాయం చేస్తున్నాయని బ్లూ ఇండియా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవితేజగౌడ్ ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, బీసీల సమస్యల పరిష్కారానికి బీసీ సంఘాలన్నీ ఏకతాటిపై రావాలన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ను రెడ్డి సామాజిక వర్గం వారు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

డ్రంకెన్ డ్రైవ్.. 92 మందిపై కేసు నమోదు

బంజారాహిల్స్: పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సంజీవరెడ్డినగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని పది ప్రాంతాల్లో పశ్చిమ మండలం ట్రాఫిక్ పోలీసులు శనివారం అర్ధరాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ 92 మంది పోలీసులకు పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేశామని పశ్చిమ మండలం ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ తెలిపారు.

తెలుగు భాషాభివృద్ధికి యువభారతి కృషి

● రచయిత విహారి


మాట్లాడుతున్న యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు డా. ఫణీంద్ర

ఖైరతాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధికి యువభారతి ఎనలేని కృషి చేస్తోందని ప్రముఖ నవలా రచయిత విహారి అన్నారు. యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, ఎంవీఆర్ ఫౌండేషన్, ఐఐఎంసీ కళాశాల సంయుక్తాధ్వర్యంలో ఆదివారం లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాలలో తెలుగు వెలుగు సమాఖ్య 12వ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విహారి నవలా రచనలోని సామాజిక అంశాలను వివరించారు. తెలుగు భాషా సాహిత్యాన్ని వ్యాప్తి చేయాలనే ఉద్దేశ్యంతో తెలుగు వెలుగు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని సభాధ్యక్షుడు ఆచార్య ఫణీంద్ర తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన వక్త మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి, ఆత్మీయ అతిథి ఐఐఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ రఘువీర్, వ్యవస్థాపక సమావేశ కర్త ఆచార్య వంగపల్లి విశ్వనాథం, ఎంవీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకటరమణ, మురళీకృష్ణ పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0తో ప్రజలకు ప్రయోజనం: దీపక్‌రెడ్డి

బోరబండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రం అమలు చేస్తున్న జీఎస్టీ 2.0తో ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో బోరబండలో ఆదివారం జీఎస్టీపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. తగ్గిన ధరల ప్రకారం వస్తువులను విక్రయించాలని దీపక్‌రెడ్డి వ్యాపారులకు సూచించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో కలిసి దుకాణాలకు జీఎస్టీ స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు శరణ్‌రెడ్డి, షర్మిలజాదవ్, కృష్ణమోహన్, భాస్కర్, రాజేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ది హౌస్ ఆఫ్ కోయిలాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

'ది హౌస్ ఆఫ్ కోయిలా' ప్రారంభం

బంజారాహిల్స్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాఫీ షాపులు యువతకు కొత్త స్నేహాలను అందిస్తాయని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. మాదాపూర్ కాకతీయ హిల్స్ రోడ్ నంబరు 11లో ఏర్పాటు చేసిన 'ది హౌస్ ఆఫ్ కోయిలా- కిచెన్, కేఫే, అండ్ బేక్ హౌస్'ను ఆదివారం టీపీసీసీ జనరల్ సెక్రటరీ, మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ, కొత్తదనం కోరుకునే ఆహార ప్రియుల కోసం ఇలాంటి కాఫీ షాపులు అహ్లాదకరమైన వాతావరణంతో పాటు మంచి ఆహారాన్ని అందిస్తున్నాయన్నారు. 'ది హౌస్ ఆఫ్ కోయిలా' డైరెక్టర్ రేవతి మాట్లాడుతూ, శాకాహార, మాంసాహార, దక్షిణ భారత వంటకాలతో పాటు పిజ్జాలు, తాజా బ్రెడ్‌లు, కేకులు, ఆర్టిసనల్ కాఫీలు, ఐస్ క్రీమ్‌లు, డెజర్ట్‌లు తమ వద్ద ప్రత్యేకమన్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు


మ్యాన్‌హోల్‌పై కొత్త మూత

యూసుఫ్‌గూడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రహమత్‌నగర్ ప్రధాన రహదారిలోని మ్యాన్‌హోల్‌కు అధికారులు ఆదివారం మరమ్మతులు చేశారు. మ్యాన్‌హోల్‌పై శిథిలమైన మూతపై బాగు చేసేదెన్నడు అనే శీర్షిక పేరిట ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. స్పందించి అధికారులు మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టారు.



విజేతలకు మెమెంటోలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

విద్యార్థులు పవిత్ర గ్రంథాల గురించి తెలుసుకోవాలి

● కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

తిరుమలగిరి అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సీరత్ - ఉన్ - నబీ(మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర)పై బొల్లారం మజీద్ కమిటీ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచడం ఎంతో అవసరమని, క్విజ్ పోటీలు నిర్వహించడం ద్వారా వారు భవిష్యత్తులో పోటీ పరీక్షల్లో కూడా విజయవంతం అవుతారని చెప్పారు. విద్యార్థులకు చదువు విషయంలో ఎటువంటి అవసరం వచ్చినా ముందుండి సహాయ పడగలనని చెప్పారు. ఇలాంటి పోటీ పరీక్షలను నిర్వహిస్తున్న మజీద్ కమిటీ వారిని, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, మజీద్ కమిటీ సభ్యులు ఇక్బాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముప్పిడి మధుకర్, సంకి రవీందర్, బద్రి యాదవ్, శేఖర్ ముదిరాజ్, నవీన్, తదితరులు ఉన్నారు.

చౌరస్తాల్లో వాహనాల తనిఖీలు



సీతాఫల్‌మండిలో వాహనాల తనిఖీలో పాల్గొన్న ఏసీపీ శశాంక్‌రెడ్డి

బౌద్ధనగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్‌జోన్ చిలకలగూడ, వారాసిగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం సాయంత్రం సీతాఫల్‌మండి, వారాసిగూడ చౌరస్తాలలో పోలీసులు వాహనాల తనిఖీలను నిర్వహించారు. ద్విచక్ర, ఇతర వాహనాలను ఆపి డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పొల్యూష్యన్ తదితర పత్రాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర కమిషనర్, ఈస్ట్‌జోన్ డీసీపీ ఉత్తర్వుల మేరకు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా చిలకలగూడ ఏసీపీ డివిజన్ పరిధిలో చిలకలగూడ, వారాసిగూడ, లాలాగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు ముఖ్య కూడళ్లలో ఉదయం, సాయంత్రం వాహనాల తనిఖీలుంటాయని తెలిపారు. వాహన పత్రాలు సరిగ్గా లేకపోతే సీజ్ చేస్తామన్నారు. ప్రజలందరూ మోటార్ వెహికల్ రూల్స్‌ను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్లు అనుదీప్, మధుసూదన్‌రెడ్డి, ఎస్సై మంజూషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెయింటింగ్స్‌ను తిలకిస్తున్న సందర్శకులు

ఆకట్టుకున్న హస్తకళా ప్రదర్శన

సికింద్రాబాద్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాగితాలతో తయారు చేసిన వివిధ రకాల వస్తువులు, కళారూపాలు, పెయింటింగ్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. బీఆర్‌డీఎస్ శిక్షణ సంస్థ ఆదివారం సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహించిన హస్తకళా ప్రదర్శన విద్యార్థుల సృజనాత్మకతకు అద్దం పట్టేలా సాగింది. 300 మంది విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల కళా రూపాలను ఎగ్జిబిషన్‌లో పొందుపరిచారు. ఈ సందర్భంగా బీఆర్‌డీఎస్ సంస్థ వ్యవస్థాపకుడు బవర్ రాథోడ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తులను వెలికితీసేందుకు, వారి నైపుణ్యాన్ని మరింత మెరుగుపరచేందుకు ప్రతి ఏడాది హస్తకళా ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. చిత్రలేఖనం పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఐఐటీ ముంబై, ఢిల్లీల్లో ప్రత్యేక కోర్సులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. డిజైన్ రంగానికి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో బీఆర్‌డీఎస్ అందిస్తున్న శిక్షణ కీలకంగా మారిందని ఆయన పేర్కొన్నారు. సంస్థ డైరెక్టర్ రీనా తదితరులు పాల్గొన్నారు.



దాండియా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, యువతులు

డెక్కన్ క్లబ్‌లో ఘనంగా దాండియా

మారేడుపల్లి అక్టోబరు 5, (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ మారేడుపల్లి డెక్కన్ క్లబ్‌లో సంప్రదాయబద్ధంగా దాండియా నృత్య కార్యక్రమం జరిగింది. కమిటీ కుటుంబ సభ్యులు, మహిళలు సందడిగా దాండియా ఆడుతూ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఆర్.ఎ. స్వరూప్, ఉపాధ్యక్షులు పి. విక్రమ్, సెక్రటరీ, పి.వసంత్ కుమార్, ట్రెజరర్, డి. వెంకటేష్ సభ్యులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో రైల్వే మాజీ ఆఫీసర్లు

ఆత్మీయ సమ్మేళనం

చిలకలగూడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన ఆఫీసర్లు ఆదివారం సికింద్రాబాద్‌లో కలుసుకుని ఉత్సాహంగా గడిపారు. పాత అనుభవాలు, అనుభూతులు గుర్తు చేసుకుంటూ ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస మూర్తి, ఎ.కె. గణేషణ్, మల్యాల శ్రీనివాస రావు, దామోదర ప్రసాద్, దామోదర ప్రసాద్, దీపా కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

స్కందగిరిలో 25వ వేద విద్వన్మహా సభలు



సమావేశంలో మాట్లాడుతున్న జనార్దనానంద సరస్వతిస్వామి సంస్కృతి ట్రస్ట్ ప్రతినిధులు

పద్మారావునగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీ జనార్ధనానంద సరస్వతి స్వామి ట్రస్ట్ రజతోత్సవ వేడుకలలో భాగంగా నిర్వహిస్తున్న వేద విద్వన్మహాసభలను విజయవంతం చేయాలని ట్రస్ట్ ప్రతినిధులు పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, రాష్ట్ర దేవాదాయశాఖ సౌజన్యంతో ఈ రజతోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు ఆదివారం పద్మారావునగర్ స్కందగిరి శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు తూములూరి సాయినాథ శర్మ, పసుమర్తి బ్రహ్మానంద శర్మ, జీవీ రావు, జయశంకర్‌లు మాట్లాడుతూ 8 నుంచి 12 వరకు స్కందగిరి శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయ ప్రాంగణంలో 25వ తెలంగాణ వేద విద్వన్మహ సభలు జరుగుతాయని తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి పండితులు, విద్యార్థులు, వేదాభిమానులు హాజరుకావాలని పేర్కొన్నారు. సనాతనా ధర్మాన్ని కాపాడటం, వేద వ్యాప్తికి ట్రస్ట్ ద్వారా దాదాపుగా 50 వేద పాఠశాలలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాజకీయ పుర ప్రముఖులెందరో హాజరవుతున్నట్లు తెలిపారు.



బోయినపల్లి నెల్లూరు పోచమ్మ ఆలయం వద్ద నిలిచిన వర్షం నీరు



మర్రి రాంరెడ్డి కాలనీలో మోకాలి లోతుకు చేరిన మురుగు

చెరువులను తలపిస్తున్న రోడ్లు

బోయినపల్లిలో ఇళ్లలోకి చేరిన మురుగు.. ఇబ్బందుల్లో స్థానికులు

బోయినపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా ఎండలతో ఉక్కిరి బిక్కిరైన బోయినపల్లి ప్రజలను వరుణ దేవుడు ఆదివారం భీకర వర్షంతో పలకరించాడు. కంటోన్మెంట్‌లోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. బోయినపల్లిలో గంట పాటు కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నదులను తలపించాయి. సీతారంపురం మర్రి రాంరెడ్డి కాలనీ హర్షవర్ధన్ కాలనీ, చైతన్య స్కూల్ ప్రధాన రహదారి, భవాని నగర్, నెల్లూరు పోచమ్మ ఆలయం రహదారి ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. దీంతో ప్రజలు ఉదయాన్నే లేచి చూసేసరికి చుట్టు పక్కల వర్షం నీటితో పాటు మురుగు ఇళ్ల వద్ద చేరడంతో ఇబ్బందులు పడ్డారు. ఆయా ప్రాంతాల్లోని నివాసాల నీటి సంపుల్లో మురుగు వచ్చి చేరింది. చేరడంతో ప్రజల ఇబ్బందులు అన్ని ఇన్ని కావు ఈ ప్రాంతంలో జీహెచ్ఎంసీకి సంబంధించిన మురుగు పైప్‌లైన్లు కంటోన్మెంట్ బోర్డు అనుమతులు లేకుండా చైతన్య స్కూల్ వద్ద కలపడంతో ఈ ప్రాంతంలో మ్యాన్‌హోళ్లు పొంగి పొర్లుతూ వర్షం నీరు, మురుగు మోకాలి లోతునకు చేరి చెరువులను తలపిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కంటోన్మెంట్ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



చైతన్య స్కూల్ వద్ద మ్యాన్‌హోల్ నుంచి పొంగుతున్న మురుగు

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి

● హరియాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



ముదిరాజ్ యువతిని సత్కరిస్తున్న దత్తాత్రేయ

పద్మారావునగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లు అన్నిరంగాల్లో రాణించాలని హరియాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి బోయగుడలోని ముదిరాజ్ భవన్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ, జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గొడుగు ఆంజనేయులు ఆధ్వర్యంలో నవాడ ముత్తయ్య ముదిరాజ్ జయంతి, 93వ దసరా సమ్మేళనం, అలయ్ బలయ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దత్తాత్రేయ మాట్లాడుతూ ముదిరాజ్‌లందరిని సంఘటితం చేసే ఇలాంటి కార్యక్రమాలను చేస్తున్నందుకు మహాసభ ప్రతినిధులను అభినందించారు. ముదిరాజ్‌లు స్వయంకృషితో ఎదగాలని, ప్రభుత్వ ఉద్యోగాల కోసం సమయాన్ని వృథా చేయక వివిధ వ్యాపారాల్లో రాణించాలని అన్నారు. ముదిరాజ్‌లకు సంబంధించిన సమస్యలేమైనా ఉంటే పరిష్కరిస్తానని హామీనిచ్చారు. అనంతరం గ్రూప్-1 ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారిని శాలువా,మెమొంటోతో ఆయన సత్కరించారు. ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు దత్తాత్రేయను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాసాని వీరేశ్ ముదిరాజ్, దొడ్ల సదానంద్, చిన్నంగి వెంకటేశ్, అంబటి చెన్నయ్య, దివాకర్, మంద శ్రీనివాస్, కాసాని సాయిరాజేంద్రప్రసాద్ దంపతులు, సుధాకర్, రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్, నీలం శ్రీనివాస్, కార్పొరేటర్ సామల హేమ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం

రాంగోపాల్‌పేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : సమాజానికి మార్గదర్శకత్వం చేసే వారు ఉపాధ్యాయులని సికింద్రాబాద్ మండల డిప్యూటీ డీఈఓ గుండప్ప అన్నారు. సికింద్రాబాద్ సర్దార్ పటేల్ రోడ్డులోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ ఐఓఎస్ ప్రసన్న కుమారి, డీసీసీ దేవదత్‌లతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిషనర్ స్కౌట్‌గా గుండప్ప, జిల్లా కమిషనర్ గైడ్స్‌గా డిప్యూటీ ఐఓఎస్ ప్రసన్న కుమారి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పలు పాఠశాలల స్కౌట్ మాస్టర్లను, గైడ్ క్యాప్టెన్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గుండప్ప మాట్లాడుతూ అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని 1994 అక్టోబరు నుంచి జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. వివిధ దేశాలు వివిధ తేదీల్లో జాతీయ టీచర్స్ డేను జరుపుకుంటారని, కానీ అంతర్జాతీయ స్థాయిలో మాత్రం అక్టోబరు 5న జరుపుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఐఓఎస్ ప్రసన్న కుమారి, డీసీసీ దేవదత్, ఉపాధ్యక్షులు పీఎల్ శ్రీనివాస్, అనహిత, ఆశిష్ విసూచక్, జిల్లా కమిషనర్లు మెహర్నీష్ భతేనా, విష్ణు ప్రసాద్, జిల్లా కార్యదర్శి రమేష్ చందర్, ట్రైనింగ్ కమిషనర్లు విజయ్ భాస్కర్, ఇందుమతి, జిల్లా కోశాధికారి రాజశేఖర్ రెడ్డి, ఆర్గనైజింగ్ కమిషనర్లు గౌరీనాథ్, సంగీతా పాండేలతో పాటు పలు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'హ్యాక్-ఎ-బోర్డ్ హ్యాకథాన్' లో ఓయూ విద్యార్థుల ప్రతిభ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సోహం అకాడమీ ఆధ్వర్యంలో సెప్టెంబరు 14న ప్రకటించిన "హ్యాక్-ఎ-బోర్డ్ హ్యాకథాన్"లో ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగం నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఈ ప్రాజెక్టులు తుది పోటీల వరకు చేరి శనివారం నిర్వహించిన ఫైనల్‌లో రెండు బహుమతులు గెలుచుకున్నాయి. డి.కె.ఇ.సిహెచ్. విద్యాసాగర్ మార్గదర్శకత్వంలో పోటీలో పాల్గొన్న కె.హరిక, ఎం.వెంకట జైదీప్ దత్త 'పక్షవాతం రోగులకు సమగ్ర సహాయక సాంకేతిక వ్యవస్థ' ప్రాజెక్టుకు మొదటి బహుమతి రూ.పది వేల నగదు అందుకున్నారు. అలాగే "రీడెక్స్-రిహాబిలిటేషన్ కోసం వేరబుల్ హ్యాండ్ ఎక్సోస్కెలిటన్" ప్రాజెక్టుకు ఉత్తమ ప్రజెంటేషన్ అవార్డు కింద జి.రాజశ్రీ పద్మావతి, సిహెచ్.హర్షవర్ధన్ రూ.2,500 నగదు పొందారు. విజేతలను బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ డి.సుమన్ అభినందించారు.

పార్కు స్థలాన్ని కాపాడండి

తిరుమలగిరి అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బొల్లారం జనప్రియ బంగ్లాస్‌కు ఆనుకుని ఉన్న కంటోన్మెంట్ పార్కు స్థలాన్ని కబ్జాకు యత్నిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో కబ్జాకు యత్నించిన స్థలంలో ధర్నా నిర్వహించారు. ఈ బంగ్లాస్ ఏర్పడినప్పుడు కంటోన్మెంట్ బోర్డుకు 40శాతం స్థలాన్ని అప్పగించామని ఆ స్థలంలో పార్కు, కమ్యూనిటీ హాల్, దేవాలయం నిర్మించాలని ఎన్నోసార్లు కంటోన్మెంట్ బోర్డుకు విన్నవించినా ఫలితం లేదని ఆరోపించారు. సుమారు ఎకరం స్థలాన్ని కబ్జా చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఈ సమాచారాన్ని రెండు రోజుల క్రితం సీఈఓ దృష్టికి తీసుకుని పోగా అక్కడ ఉన్న రూమ్‌ను కూల్చి, కబ్జాదారుని సామగ్రిని జప్తు చేయాలని స్థానిక ఇంజనీర్‌కు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. స్థలాన్ని కాపాడి పార్కు, కమ్యూనిటీ హాల్, దేవాలయాన్ని ఏర్పాటు చేయాలని వారు అధికారులను కోరారు. ధర్నాలో జనప్రియ బంగ్లాస్ బ్లాక్‌ల అధ్యక్షులు శ్యామ్ రెడ్డి, శ్యామ్ గౌడ్, దస్తగిరి, రామక్రిష్ణ, మణికంట, బలరామ్, మూర్తి, రాజన్, సుధాకర్, రాజేందర్ లు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న గొలుసు.. బాధితురాలికి అందజేత



బాధితురాలికి బంగారు గొలుసును అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ రమేష్ గౌడ్

రాంగోపాల్‌పేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణంలో పోగొట్టుకున్న తులంన్నర బంగారు గొలుసును సీసీ కెమెరాల ద్వారా గుర్తించి బాధితురాలికి మహంకాళి పోలీసులు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ రమేష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం గుంటూరుకు చెందిన స్వాతి ఇంటర్వ్యూ నిమిత్తం ఆదివారం సికింద్రాబాద్‌కు రైలులో వచ్చి అక్కడి నుంచి సరోజినిదేవి రోడ్డులోని గ్రాండ్ మినిర్వా హోటల్‌కు క్యాబ్‌లో వచ్చింది. క్యాబ్ దిగి హోటల్ రూమ్‌కు వెళ్లిన తర్వాత చూసుకుంటే తన వంటిపై ఉన్న లక్ష అరవై వేల రూపాయల విలువ గల తులంన్నర బంగారు గొలుసు కనిపించలేదు. దీంతో ఆమె మహంకాళి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు బాధితురాలి వద్ద వివరాలు సేకరించి సీసీ కెమెరాలను పరిశీలించి హోటల్ సమీపంలో రోడ్డుపై బంగారు గొలుసును గుర్తించి దానిని సేకరించి బాధితురాలికి అప్పగించారు. బంగారు గొలుసును అందుకున్న బాధితురాలు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది, వెంటనే స్పందించి బాధితురాలికి తాను పోగొట్టుకున్న నగను అందజేసినందుకు మహంకాళి పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

అష్టబంధన మహా కుంభాభిషేకం



ఆలయ ప్రాంగణంలో మహా కుంభాభిషేక ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వాహకులు

బౌద్ధనగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస్‌నగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో 24 నుంచి 31వరకు ఎనిమిది రోజులు పాటు మహా సంప్రోక్షణ అష్టబంధన మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేశ్‌కుమార్, ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావులు తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మహాకుంభాభిషేక ఆహ్వానపత్రికను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయ పునర్నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత శాస్త్ర ప్రకారం అష్టబంధన మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కంచి కామకోటి శంకరాచార్య, శంకర విజయేంద్ర సరస్వతి, పుష్పగిరి మహాసంస్థాన పీఠాధీశ్వరులు అభినవోద్దండ విద్యాశంకర భారతి, శ్రీమదష్టాక్షరీ పీఠాధీశ్వరులు త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజ జీయరు స్వాములు ముఖ్యఅతిథులుగా హాజరై కుంభాభిషేకంలో పాల్గొని అనుగ్రహభాషణం చేస్తారని తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని బాలాలయంలో గోదా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివార్లకు ధూపదీప నైవేద్యాలు, అన్నిరకాల కైంకర్యాలు కొనసాగుతున్నాయని అన్నారు. మహాకుంభాభిషేకం తర్వాత పునర్నిర్మించిన ఆలయాన్ని భక్తులకు అందుబాటులో తీసుకువస్తామన్నారు. ఆధ్యాత్మికవేత్తలు, భక్తులు పెద్దసంఖ్యలో హాజరై సహాయ సహకారాలు అందించి మహాకుంభాభిషేకాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బాలభాస్కర్, సూర్యసుబ్రమణ్యం, లక్ష్మీనారాయణ, శివశంకరన్, నారాయణన్, సుజయ్‌ప్రకాశ్, షణ్ముకరెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

కుంగిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



బౌద్ధనగర్ జవహర్ వీఎస్ హైస్కూల్ లేన్‌లో కుంగిన రోడ్డు

బౌద్ధనగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ జవహర్ వీఎస్ హైస్కూల్ లేన్‌లో సిమెంట్ రోడ్డు కుంగి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో సిమెంట్ రోడ్డు కుంగిపోయింది. స్థానికులు అధికారులు, ప్రజాప్రతినిధులకు సమాచారమందించినా ఫలితం లేదని వారు వాపోతున్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వర్షపునీరు కుంగిన రోడ్డుపై నిలుస్తుందని, ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుంగిన రోడ్డు వద్ద మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న ఏఐఆర్‌ఆర్‌ఎఫ్ ప్రతినిధులు

రైల్వే కాలనీలో స్వచ్ఛ భారత్

చిలకలగూడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ, రైల్వే కాలనీలో స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్ ప్రతినిధులు పరిసరాలను పరిశుభ్రం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ తమవంతు చర్యలు చేపట్టాలని అధ్యక్షుడు శ్రీధర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు యస్. శ్రీధర్, బాబు రావు, నరసింగరావు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.